www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 195, సోమవారం 17-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వెల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

## తుమ్మల అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు



3 లో..

## చిన్నపాటి వర్షానికే తాడ్వాయి వీధులు జలమయం



5వ పేజీల్లో

# పైరవీలకే జర్నలిస్టు సంఘాల పరిమితం

జీవచ్ఛవాలుగా మారుతున్న జర్నలిస్టుల బతుకులు

ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో వాస్తవాలను ప్రజల వద్దకు చేర్చలేని దుస్థితి

జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమరశంఖం పూరింపు

జేఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కానుగంటి రాజు

త్వరలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ మహాసభలు



**హైదరాబాద్ ఆగస్టు 16 :**

జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ మహాసభలను నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించాలని ఆదివారం సమావేశమైన కార్యవర్గం తీర్మానించింది. సమావేశం వివరాలను తెలంగాణ జెఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి డా. కానుగంటి రాజు వివరిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై నిర్దిష్టమైన ఒత్తిడి తేకుండా అనేక సంఘాలు తమ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. జర్నలిస్టు సంఘాలు లేవనెత్తిన అనేక సమస్యల్లో ఏ ఒక్క సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదని, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, రైల్వే పాసులు, వేతన విధానం తదితర అంశాలలో ఏ ఒక్క సమస్యకు పరిష్కారం దొరకకపోవడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. సంఘాల పేరుతో అనేకమంది పైరవీలు చేసుకుంటూ తమ ఆస్తులను పెంచుకోవడం అలవాటుగా మారిన నేపథ్యంలో జర్నలిస్టుల జీవితాలు అవుట్ సోర్సింగ్ ..మిగతా 2లో




## నేటి నుండి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**అమరావతి ఆగస్టు 16:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపరుస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. నేటి ఉదయం 9 గంటలకు శాసనసభ, ..మిగతా 2లో

## వంద మంది కేసీఆర్‌లు వచ్చినా...

# వెంట్రుక పీకలేరు!

### చంద్రశేఖర రావు ది ఫ్యామిలీ జస్టిస్, నేను చేసేది సోషల్ జస్టిస్



రెచ్చగొట్టాలే మంది పిల్లలను సావగొట్టాలె శవాల పునాదులపై అధికారం చెలాయించాలి

తెలంగాణ భవన్ లో రక్తదాన శిబిరం పెట్టి కోట్ల రూపాయలకు అమ్ముకున్న దుర్మార్గులు

అగ్గిపెట్టె రావు, అఘోరా రావు మాటలు విని మోసపోకండి

సెప్టెంబర్ లో అసెంబ్లీ పెడుతున్న, బావా బామ్మర్దులు, కేసీఆర్ ను అసెంబ్లీకి తీసుకురండి

పరకాల సభలో టిఆర్ఎస్ నేతలను ఏకి పారేసిన సీఎం రేవంత్

**వరంగల్ ఆగస్టు 16 :**

అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావా-బావమరిది (కేటీఆర్, హరీశ్‌రావు) పదే పదే అడుగుతున్నారు.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్ ను కూడా సభకు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, రెండున్నరేళ్ల మా కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో జరిగిన పనులపై చర్చిద్దామన్నారు. ఆదివారం పరకాల సభలో మాట్లాడిన సీఎం. విడతల వారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేని వారు ఇప్పుడు మన పిల్లలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం అన్నారు. అగ్గిపెట్టేరావు, అఘోరరావు మాటలు వింటే మోసపోతారని నిరుద్యోగులు నిరసనల్లో పాల్గొంటే కేసులతో ఇబ్బందిపడతారని హెచ్చరించారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అహర్నిశలు కష్టపడుతున్నామని స్పష్టం చేశారు.

**కార్యకర్తల రక్తాన్ని అమ్ముకున్నారు**

రక్తదానం పేరుతో హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల రక్తాన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని సొమ్ముచేసుకున్నారని మీరు మనుషులా రాక్షసులా అని సీఎం ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబం రక్తపిపాసులుగా మారారని ధ్వజమెత్తారు. పార్టీలో పదవులు తీసుకున్న కేసీఆర్ కుటుంబం ఆయన బంధువులు ఎందుకు రక్తదానం చేయలేదు. అని నిలదీశారు. ప్రజల కోసం ఎంతవరకైనా కష్టపడతానని మీ ఆశీర్వాదం ఉన్నంత వరకు వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా ..మిగతా 2లో



## కాంగ్రెస్ ప్రభుత్వం కులాలని...

# బిఆర్ఎస్ క్షుద్ర పూజలు

మేడారం మొక్కు తీర్చుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించిన సీఎం

ములుగులో 484 కోట్ల అభివృద్ధి పనులకు పైలాన్ ఆవిష్కరణ

**వరంగల్ ఆగస్టు 16:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటించారు ఇందులో భాగంగా నే తొలుత ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. అక్కడ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు చేరేచారెలు సమర్పించి ఎత్తు బంగారం సమర్పించారు అనంతరం కోయ గిరిజనులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం అక్కడినుండి ములుగు చేరుకుని ఘటన వద్ద ములుగులో చేపట్టనున్న 484 కోట్ల అభివృద్ధి పనులకు గాను పైలాన్ ఆవిష్కరించారు అక్కడి నుండి ములుగు చేరుకుని ములుగులో కొత్తగా నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు అక్కడ ప్రజలు ..మిగతా 2లో



## కాలువలో పడిన కారు..

# నలుగురి గల్లంతు

2

ఇరగవరం మండలం

ఆయిలంపూడి లాకుల వద్ద ఘటన

గల్లంతైన వారి కోసం ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు



2

## ఫారెస్ట్ పర్మిషన్ల ట్యాంపరింగ్

ఖమ్మంలో ఇద్దరు కలప స్మగ్లర్ల అరెస్ట్

# తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు

## ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు



ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

'టీజీ సేఫ్' పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు

నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం

**హైదరాబాద్ ఆగస్టు 16:**

తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను ..మిగతా 2లో



## మోదీ ఫొటో కావాలంటే...

# సన్నబియ్యం డబ్బులివ్వండి

## ఉత్తమ్

2

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు

సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం

పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు

రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ

## వచ్చే వారం నుంచి...

# ఉద్యోగ నోటిఫికేషన్లు

పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ

ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్



**హైదరాబాద్ ఆగస్టు 16 :**

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ..మిగతా 2లో

# జనని-సూర్యతేజ వివాహం

సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..

ఆనందంతో ఏడ్చేసిన బండ్ల గణేశ్



2

# తెలంగాణలో 'టీజీ సేఫ్' ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి...**

విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది.'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది.ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.



## వంద మంది కేసీఆర్‌లు వచ్చినా... వెంట్రుక పీకలేరు!

**మొదటి పేజీ తరువాయి...**

పీకలేరన్నారు. సోషల్ మీడియాలో పెడితే ఒరిగేది లేదు కరిగేదని, రేపు శాసనసభలోనే తేల్చుకుందామన్నారు.

ఎప్పటికీ అధికారంలోనే ఉంటామని విర్రవీగిన వారిని వరంగల్ జిల్లా ప్రజలు బండకేసి కొట్టారని, తమను ఓడించేవారే లేరనుకున్న వారిని రాజకీయంగా బొందపెట్టారని సీఎం వ్యాఖ్యానించారు. కాకలు తీరిన రాజకీయ నేతలను యశస్విని రెడ్డి భారీ మెజారిటీతో ఓడించి ప్రజల తీర్పు ఏంటో చూపించారని గుర్తుచేశారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం చెప్పారు. బీఆర్ఎస్ రెండుసార్లు రుణమాఫీ పేరిట మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసి చూపించిందన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు జమ చేశామని, మొత్తంగా రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.లక్షా 37 వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

**కవితను ఇంటి నుంచి పంపేశారు**

జైలుకుపోయి కష్టాల్లో వచ్చిన తన సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితను కేటీఆర్ ఇంటి నుంచి బయటకు పంపేశాడని ఇదంతా చూస్తున్న కేసీఆర్ తన కొడుకుకు బుద్ధి చెప్పాల్సింది పోయి మౌనంగా ఉండిపోయారని విమర్శించారు. ఇక అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు

**తిరుమల ఆగస్టు 16 :**

వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజన సందోహంతో కిటకిట లాడుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది.తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం (ఆగస్టు 15న) ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.81 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## వచ్చే వారం నుంచి... ఉద్యోగ నోటిఫికేషన్లు

**మొదటి పేజీ తరువాయి...**

హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

## ఫారెస్ట్ పర్మిషన్ల ట్యాంపరింగ్

### ఖమ్మంలో ఇద్దరు కలప స్మగ్లర్ల అరెస్ట్

**ఖమ్మం,ఆగస్టు 16:**

అటవీ శాఖ అనుమతి పత్రాలను ట్యాంపరింగ్ చేసి,అక్రమంగా కలప రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీసీఎస్ ఏసీపీ మహ్మద్ సర్వర్ ఆదివారం మీడియాకు తెలిపారు.గతేడాది డిసెంబర్‌లో ఖమ్మం ఫారెస్ట్ రేంజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు,పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో ఏసీపీ మహ్మద్ సర్వర్ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ గౌడ్ దర్యాప్తు చేపట్టి ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు.సూర్యాపేట జిల్లా మోతే మండలం గోప్య తండాకు చెందిన కలప వ్యాపారి కొర్ర శివ, విజయవాడకు చెందిన రాధే శ్యామ్‌లను ఈ కేసులో అరెస్ట్ చేశారు.ఖమ్మం ఫారెస్ట్ కార్యాలయం నుండి నల్ల తుమ్మ కర్ర కోసం ఇతరుల పేరుతో పొందిన అనుమతి పత్రాలను ట్యాంపరింగ్ చేసి,వాటిని సంద్ర కర్రగా మార్చారు. అయ్యగారూ పల్లి, కురవి,సీరోలు, కంపెల్ళి,మహబూబాబాద్ ప్రాంతాల్లో సంద్ర చెట్లను నరికి, నకిలీ పర్మిషన్‌తో రాధే శ్యామ్‌కు విక్రయించారు.అనంతరం ఈ కలపను మధ్యప్రదేశ్,జాబువాలోని ఏ.ఎం ఎంటర్‌ప్రైజెస్ యజమాని అబ్దుల్ రహేమాన్‌కు సరఫరా చేశారు. అక్కడ పాన్ మసాలాలో వాడే కత్తా (కాచు) తయారీకి ఈ సంద్ర కర్రను ఉపయోగిస్తారని,ఇప్పటివరకు సుమారు 9 లారీల కలపను ఇతర రాష్ట్రాలకు తరలించినట్లు పోలీసు విచారణలో తేలింది.నిందితుడు కొర్ర శివపై గతంలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా ఫారెస్ట్ కేసులు ఉన్నట్లు గుర్తించారు.ఈ కేసులో ప్రమేయం ఉన్న మరికొందరి కోసం విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ సర్వర్, ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ గౌడ్, ఎస్సై వంశీ కృష్ణ సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## పైరవీలకే జర్నలిస్టు సంఘాలు పరిమితం

**మొదటి పేజీ తరువాయి...**

బతుకుల కన్నా హీనంగా మారాయని కానుగంటి రాజు ఆందోళన వ్యక్తపరిచారు. సమాజాన్ని మార్చాలని దృఢ సంకల్పంతో వృత్తిలోకి ప్రవేశించే జర్నలిస్టుల బతుకులు ఆర్థిక బాధలతో నిర్వీర్యంగా మారి, తప్పనిసరి పరిస్థితుల్లో జీవచ్ఛవంలా మిగులుతున్నారని ఈ పరిస్థితులను మార్చడానికి జర్నలిస్టు సంక్షేమ సంఘం కృత నిశ్చయంతో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. నగరంలోని జె ఎస్ ఎస్ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరించిన అనంతరం సమావేశమైన కార్యవర్గం పలు తీర్మానాలను చేసింది. మిత్రుల ప్రోత్సాహం ఐకమత్యంతో జర్నలిస్టుల బతుకులు మార్చేందుకు తమ సంఘం కంకణం కట్టుకొని పోరాటం చేస్తుందని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కానుగంటి రాజు ప్రకటించారు. త్వరలో నిర్వహించనున్న జాతీయ మహాసభలను తెలుగు రాష్ట్రాలలోని జర్నలిస్టులు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కాలువలో పడిన కారు.. నలుగురి గల్లంతు

**ఇరగవరం ఆగస్టు 16 :**

పశ్చిమ గోదావరి జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఇరగవరం మండలం ఆయిలంపూడి లాకుల వద్ద నియంత్రణ కోల్పోయిన ఓ కారు ప్రమాదవశాత్తు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు గల్లంతు కాగా, మరో వ్యక్తి సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు.ఓగిడి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు పెరవలిలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరై, తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆయిలంపూడి లాకుల సమీపంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి వేగంగా కాలువలోకి పడిపోయింది. ప్రమాద సమయంలో ఒక యువకుడు వెంటనే కారులో నుంచి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకోగా, మిగిలిన నలుగురు కారుతో పాటు నీటిలో మునిగిపోయారు.గల్లంతైన వారిని పోతుల లక్ష్మీ భాను (18), రాజారామ్ (17), నాగిరెడ్డి దుశ్వంత్ (18), సాయి సూర్య (19)గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సాయంతో కాలువలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.




## నేటి నుండి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి...**

10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. తొలిరోజే ఉభయ సభల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు నిర్వహించి సమావేశాల వ్యవధి, రోజువారీ కార్యక్రమాలను ఖరారు చేయనున్నాయి. ఈ దఫా సమావేశాలు సుమారు నాలుగు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కీలక బిల్లులపై ప్రభుత్వం దృష్టి**

ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన దిశ చట్టాన్ని ఉపసంహరించుకునే బిల్లు, మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యామ్నాయంగా మరింత పటిష్టమైన నిబంధనల రూపకల్పన, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని 34 శాతానికి పెంచే అంశంపై ప్రభుత్వం బిల్లు తీసుకురావడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన బిల్లును సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల భోగట్టా. పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగవంతం చేయడం లక్ష్యంగా రూపొందించిన ఏపీ పీపీపీ పాలసీ-2026, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించిన చట్టపరమైన సంస్కరణలు కూడా సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. వీటికి రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది.

**అమరావతి అంశాలకు ప్రాధాన్యం**

రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించిన పలు నిర్ణయాలు కూడా సమావేశాల సందర్భంగా చర్చకు వచ్చే అవకాశముంది. క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్, అమరావతి మౌలిక వసతుల అభివృద్ధి, రైల్వే-రోడ్డు కనెక్టివిటీ, భూసేకరణ తదితర అంశాలపై ప్రభుత్వం తన నిర్ణయాలను సభ ముందు వివరించే అవకాశం ఉంది.

**మేయర్లు, చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు**

మున్సిపల్ మేయర్లు, చైర్మన్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానానికి సంబంధించిన చట్ట సవరణలపైనా చర్చ జరగనున్నట్లు సమాచారం. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈ ప్రతిపాదన కీలకంగా మారనుంది.

**డీఎస్సీపై ప్రతిపక్షం**

మరోవైపు మెగా డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు సమావేశాల్లో రాజకీయంగా వేడెక్కించే అవకాశం ఉంది. ఈ అంశంపై సమగ్ర విచారణకు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోంది. శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తేందుకు ఆ పార్టీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. సంక్షేమ పథకాల అమలు, రైతు సమస్యలు, సాగునీరు, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, శాంతిభద్రతలు, పెట్టుబడులు, పరిశ్రమలు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలు కూడా సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

**భద్రత కట్టుదిట్టం**

శాసన సభ, మండలి సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల ప్రవేశానికి డిజిటల్ పాస్‌ల తనిఖీలను పటిష్టం చేయడంతో పాటు సభ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనసభ్యులు అడిగే ప్రశ్నలకు శాఖల నుంచి సమాధానాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం కులాలని... బిఆర్ఎస్ క్షుద్ర పూజలు

**మొదటి పేజీ తరువాయి...**

ఉద్దేశించి కాసేపు మాట్లాడానంతరం నేరుగా హనుమకొండ జిల్లా పరకాల వెళ్లారు ఎక్కడ ప్రజలు ఉద్దేశించి బహిరంగ సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. పరకాల లో ప్రజా మీటింగ్ అనంతరం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు . ఈ సందర్భంగా ములుగులో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఓర్వలేని టీఆర్ఎస్ నేతలు ఇతర రాష్ట్రాలకు వెళ్లి క్షుద్ర పూజలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని క్షుద్ర పూజలు చేస్తున్నారని మండిపడ్డారు ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసిన మళ్లీ వచ్చే పదివేలలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ఆయన చెప్పారు. ములుగు జిల్లాలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని హైదరాబాదులో దీటుగా ములుగును అభివృద్ధి చేసేందుకు కంకణ బద్ధుడై ఉన్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. ఇంట్లో గెలవలేని కేటీఆర్ రోజుల్లో ముఖ్యమంత్రి అవుతారని తోడబుట్టిన చెల్లిని బయటనేట్టిన అయ్యా కొడుకుల ప్రజలు ఎలా నమ్మి ఓట్లు వేస్తారని అన్నారు. అనంతరం ములుగు ఎమ్మెల్యే మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అన్ని విధాలుగా తమ్ముడిగా అన్నగా అనేక సేవలను అందిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మనం అంతా గుండెల్లో పెట్టుకొని చూసుకోవాలని అన్నారు 10 ఏళ్ళు ముఖ్య మంత్రిగా ఉన్న కేసీఆర్ ఒక్కసారి కూడా మేడారం జాతరకు రాలేదని ఫామ్ హౌస్కే పరిమితమై ఉన్నారని ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి మూడుసార్లు మేడారం వచ్చి మేడారంలో శాశ్వత పాములను చేయించడం జరిగిందని అలాగే రానున్న రోజులలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నమ్మకం ఉందని సీతక్క జ్యోతిషం చెప్పారు. హృదయపూర్వకంలో ఆడబిడ్డలు అన్ని రంగాలలో ముందుకు సాగేందుకు హార్థికంగా అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని తప్పకుండా రానున్న రోజులలో ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ బలరాం నాయక్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



## జనని-సూర్యతేజ వివాహం

### సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..

### ఆనందంతో ఏడ్చేసిన బండ్ల గణేశ్

**హైదరాబాద్ ఆగస్టు 16 :**

ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు-నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళ సూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## విశాఖ ఎయిర్ పోర్టులో విమాన సేవలు నిలిపివేత

**విశాఖపట్నం ఆగస్టు 16 :**

దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో పౌర విమాన సర్వీసులు నేటి అర్ధరాత్రి నుంచి శాశ్వతంగా నిలిచి పోనున్నాయి.గత నాలుగున్నర దశాబ్దాలుగా సేవలందించిన ఈ విమానాశ్రయానికి వీడ్కోలు పలుకుతూ రేపటి నుంచి అన్ని సాధారణ ప్రయాణికుల విమాన సర్వీసులు నూతనంగా అందుబాటులోకి వచ్చిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే నిర్వహించనున్నారు. దీంతో విశాఖ విమానాశ్రయం ఇకపై పూర్తిగా భారత నావికా దళం ఆధ్వర్యంలోనే పని చేయనుంది

# 22 నుంచి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర

**- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ నిర్ణయం**

**- సుబ్లేడులో షోయబుల్లా ఖాన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభం**

**- నియోజకవర్గాల వారీగా కొనసాగనున్న యాత్ర**

**- విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 16 (భద్రాద్రిన్యూస్ ):-** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం ఈనెల 22వ తేదీ నుంచి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ - 2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా పాదయాత్ర నిర్వహించాలని తలపెట్టినట్లు చెప్పారు. నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన జర్నలిస్టు, కవి షోయబుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకొని పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని అయన విగ్రహం వద్ద నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. సుబ్లేడులో మొదలయ్యే ఈ పాదయాత్ర అక్కడి నుంచి నేరుగా తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండల కేంద్రాలతో పాటు ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీలో కొనసాగుతుందని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని జర్నలిస్టులతో కలిసి సాగే ఈ పాదయాత్రకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. ఇళ్ల స్థలాల సాధన కోసం నియోజకవర్గాల వారీగా సాగే ఈ పాదయాత్రను విజయవంతం చేయాల్సిందిగా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

# ఐలయ్యకు వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 16( భద్రాద్రిన్యూస్ ):** ఖమ్మం కు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు కవి రచయిత పంజాల ఐలయ్యకు వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు 2026 లభించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనందలహరి సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సాహిత్య రంగంలో చేస్తున్న కృషికి గాను జాతీయ సమైక్యత పురస్కారానికి ఎంపిక చేశారు. ముఖ్య అతిథులు ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, వంశి ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కా ను వెంకటరమణ సినీ నటులు జెన్నీ , ఏసిపి నరేష్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ సమైక్యత పురస్కారాన్ని అందజేశారు. ఈ సభకు వందే భారత్ మూవీ డైరెక్టర్ మల్లం రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డుతోపాటు ప్రశంస పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

# నేటి నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ప్రజావాణి

**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**- ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ**

**- మండల ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తులను మండల స్థాయిలోనే అందజేయాలి**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు-16 (భద్రాద్రిన్యూస్ ):** గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి అర్జీలు సమర్పించే ప్రజల సౌకర్యార్థం ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశ్యంతో నేటి నుండి (ఆగస్టు 17వ తేదీ నుంచి) ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణితో పాటు, ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయా మండలాల ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను మండల స్థాయిలోని ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తుల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# శ్రీ జయ శ్లోక హై స్కూల్ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 16 (భద్రాద్రిన్యూస్ ):** స్థానిక శ్రీ జయ శ్లోక హై స్కూల్ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. విద్యార్థులలో దేశభక్తి ని నింపేవిధంగా, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన క్విజ్ కార్యక్రమం స్ఫూర్తిని నింపింది. భారతదేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను ప్రతి విద్యార్థి తెలుసుకునే అవకాశం గా ఉపయోగపడింది. చిన్నారులలో ప్రతిభను వెలికి తీసేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఆర్ట్ కాంపిటీషన్ అద్భుతంగానే ఉంది. విద్యార్థులు తమ ప్రతిభతో వేసిన చక్కని పెయింటింగ్స్ ఎంతో అలరించాయి. వాటిని చూసి పేరంట్స్ కూడా ఆనందాన్ని వ్యక్తం చేశారు. పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలతో స్కూల్ ప్రాంగణమంతా భారతదేశం మీద ఉన్న ప్రేమ, గౌరవం ప్రతిధ్వనించింది. స్కూల్ కరెస్పాండంట్ షిఫాలీ జగదీష్ శర్మ గారు , జెండావందనం చేసిన తరువాత, విద్యార్థులందరికీ స్టీల్ బాక్స్ బహుకరించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అంటే ఏమిటో, మన పూర్వీకులు చేసిన త్యాగాలకు మనం తిరిగి ఇవ్వవలసినది ఏమిటో వివరించారు. ప్రతి ఒక్కరు చిన్నప్పటినుండే దేశం మీద ప్రేమతో జీవించాలని, దేశానికి మనం ఏమి చేయగలం? ఈ దేశ అభివృద్ధికి మనం ఏ విధంగా తోడ్పడగలము అని ఆలోచించాలని అన్నారు. పేరెంట్స్ కూడా ఇంటి వద్ద తమ పిల్లలను క్రమశిక్షణ గల భారత పౌరులుగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. వందేమాతర నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.

# తుమ్మల అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు

**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 16( భద్రాద్రిన్యూస్ ):** ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. గతంలో తనపై 'కాశీం రజ్వీ' అంటూ తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులు ప్రస్తుతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆయన కుమారుడి వెంట ఉంటూ ఇసుక, మట్టి, భూ అక్రమాలకు పాల్పడుతున్నారని పువ్వాడ మండిపడ్డారు. ఆదివారం జరిగిన ఖమ్మం నగర ఖానాపురం హవేలి పరిధి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు కల్పించినా బీఆర్ఎస్ పార్టీతోనే కార్యకర్తలు ఉన్నారని, పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఎవరి ఉడత ఊపులకు భయపడేది లేదని, తగిన సమాధానం చెప్పేలా వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకునే విధంగా ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నడూ 'జై తెలంగాణ' అనని తుమ్మలను కేసీఆర్ మంత్రిని చేశారని అన్నారు. తుమ్మల ఏ పార్టీలో ఉన్నా మంత్రి పదవిని అనుభవించారని, అయితే ఖమ్మం ప్రజలకు ఆయన చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. తాను ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మం నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. సోషల్ మీడియాలో పువ్వాడ అజయ్ కుమార్ పేరు కనిపిస్తే కొందరు ఉబలాటపడుతున్నారని ఆయన విమర్శించారు. పాత కాంగ్రెస్ కంటే కొసరు కొత్త కాంగ్రెస్ నాయకులే ఎక్కువ హడావుడి చేస్తున్నారని, ఇదే విషయాన్ని కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. నిర్మాణం పూర్తయిన ఏడాదికే కాలువ సీసీ లైనింగ్ కూలిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజాధనంతో చేపట్టిన ఇలాంటి భారీ ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన దేవరపల్లి--ఖమ్మం జాతీయ రహదారికి క్రెడిట్ తీసుకునేందుకు ప్రచారం చేసుకుంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరాటపడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన రహదారిని తన ఘనతగా చూపించుకునేందుకు షో చేసేలా ప్రయత్నించడం సరికాదన్నారు. ఆ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోజుకో ప్రమాదం చోటుచేసుకుంటున్నప్పటికీ ప్రజల భద్రతపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మున్నేరుపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పువ్వాడ తెలిపారు. వాటికి నిధులు విడుదల చేసి, జీవోలు జారీ చేసింది నాటి కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. మున్నేరు వరద బాధితులకు శాశ్వతంగా అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టామని చెప్పారు. ఖమ్మం బస్‌స్టాండ్‌ను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తే, దానిపై అనేకమంది విమర్శలు చేశారని అన్నారు. గోళ్లపాడు చానల్‌ను సుందరంగా తీర్చిదిద్దింది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలన అట్టర్ ఫ్లాప్ సినిమా లాగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# భగ్న విప్లవ ప్రేమికుడు రాయల చంద్రశేఖర్ మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

**- సహచరులు, బంధుమిత్రుల స్మృతులతో పుస్తకావిష్కరణ సభ**

**- మాస్‌లైన్ పార్టీ వైఖరిపై తీవ్ర విమర్శలు**






**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 16 (భద్రాద్రిన్యూస్ ):-** విప్లవోద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన రాయల చంద్రశేఖర్ జీవితం, ఆయన మృతి, చివరి రోజుల్లో ఎదుర్కొన్న పరిస్థితులపై సమగ్రంగా చర్చిస్తూ "ఓ భగ్న విప్లవ ప్రేమికుడు రాయల చంద్రశేఖర్" పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగింది. చంద్రశేఖర్ సహచరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు వివిధ విప్లవ, కమ్యూనిస్టు పార్టీలకు చెందిన కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన జీవితం, ఉద్యమ ప్రస్థానం, మృతి చుట్టూ నెలకొన్న సందేహాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. చంద్రశేఖర్ మృతిని కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా, ఆయన సుదీర్ఘ విప్లవ ప్రస్థానం, ఉద్యమంలో ఎదుర్కొన్న ఒత్తిళ్లు, చివరి దశలో చోటుచేసుకున్న పరిణామాలపై లోతైన సమీక్ష అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

**"మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయి"**

సభలో మాట్లాడిన పలువురు నాయకులు రాయల చంద్రశేఖర్ మృతిపై ఇప్పటికీ అనేక ప్రశ్నలు, అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన మృతి వెనుక వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలంటే సమగ్ర విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఐఎఫ్టియు జాతీయ ఉపాధ్యక్షులుపీ. ప్రసాద్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఏడు ప్రాంతాల్లో తిరుగుతూ విప్లవోద్యమంలో పనిచేశారని, ఆయన మృతిపై మైక్రో, మ్యాక్రో స్థాయిల్లోనూ విచారణ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయన ఉద్యమ జీవితంలోని వివిధ దశలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు.

**"50 ఏళ్ల విప్లవోద్యమంలో డీ-క్లాసిఫికేషన్ జీవితం"**

సతీష్ చందర్ మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ దాదాపు 50 సంవత్సరాల విప్లవోద్యమ జీవితాన్ని కొనసాగించారని, డీ-క్లాసిఫికేషన్ జీవితం గడిపిన వ్యక్తిగా ఆయన ప్రస్థానాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తిని బలహీనమైన పరిస్థితులకు నెట్టివేసే పరిస్థితులకు ఎవరు కారణమయ్యారనే అంశాన్ని కూడా సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**మాస్‌లైన్ పార్టీ వైఖరిపై ప్రశ్నలు**

చంద్రశేఖర్ చివరి దశలో ఎదుర్కొన్న మానసిక పరిస్థితులపై కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను ప్రదర్శించారు. మాస్‌లైన్ పార్టీతో ఆయనకు ఏర్పడిన విభేదాలు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, ఆయనను మానసికంగా కృంగదీసిన పరిస్థితులపై ప్రజెంటేషన్‌లో వివరించినట్లు సభ నిర్వాహకులు తెలిపారు.

రాయల చంద్రశేఖర్ సహచరి రాయల విమల మాట్లాడుతూ తనపై, తన భర్తపై వివిధ రకాలుగా నేరస్తులుగా ముద్ర వేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులను, చంద్రశేఖర్ చివరి రోజుల్లో చోటుచేసుకున్న పరిణామాలను సమాజం ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**"కమ్యూనిస్టులంతా ఒక్కటై ఆలోచించాలి"**

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ మృతి విచారించదగినదని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి చెందిన వారంతా విభేదాలను పక్కనపెట్టి ఒకటై ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు. రానున్న కాలమంతా కమ్యూనిస్టులు దేనని పిడిఎస్ఈ నుండి వచ్చిన ఎందరో పెద్దపెద్ద పదవులకు ఉద్యోగాలకు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు

**"మృతి చెందిన నాటి నుంచి అపోహలు"**

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ మరణించిన నాటి నుంచి అనేక రకాల అపోహలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. సభలో విడుదల చేసిన ఆడియో ద్వారా ఈ వ్యవహారానికి సంబంధించి కొన్ని అంశాలు స్పష్టమయ్యాయని పేర్కొన్నారు. వాస్తవాలను నిర్ధారించేందుకు సమగ్ర పరిశీలన జరగాలని అన్నారు.

**"పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి"**

ఏకేఎంఎస్ జాతీయ నాయకులు వేములపల్లి వెంకటరామయ్య మాట్లాడుతూ రాయల విమల రచించిన పుస్తకం మాస్‌లైన్ పార్టీతో పాటు విప్లవ పార్టీలన్నింటినీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రశ్నిస్తోందన్నారు. ఉద్యమంలో పనిచేసిన వ్యక్తుల జీవితాలు, వారి కుటుంబాలు ఎదుర్కొన్న సమస్యలపై రాజకీయ సంస్థలు బాధ్యతగా సమీక్షించుకోవాలని సూచించారు.

మధు మాట్లాడుతూ చంద్రశేఖర్ మృతి తర్వాత కూడా ఆయన కుటుంబంపై దాడులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మాస్‌లైన్ పార్టీ తన వైఖరిపై సమీక్షించుకోవాలని, తమకు ఎలాంటి తప్పు లేకపోతే ఈ సభకు హాజరుకాకపోవడానికి కారణమేంటో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు.

**"ఆత్మహత్యా? హత్యా? వాస్తవాలు వెలుగులోకి రావాలి"**

సభలో కొంతమంది వక్తలు రాయల చంద్రశేఖర్ మృతిని "ఆత్మహత్యగా కాకుండా హత్యగా అనుమానించాల్సిన పరిస్థితులు ఉన్నాయి" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి తుది నిర్ధారణ రావాలంటే స్వతంత్ర, సమగ్ర విచారణ అవసరమని వారు పేర్కొన్నారు. చంద్రశేఖర్‌ను బలహీనమైన పరిస్థితుల్లోకి నెట్టివేసిన కారణాలు, ఆయన ఎదుర్కొన్న మానసిక ఒత్తిళ్లు, పార్టీ అంతర్గత పరిణామాలు, కుటుంబంపై వచ్చిన ఆరోపణలు తదితర అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని సభలో పలువురు డిమాండ్ చేశారు.

**విప్లవోద్యమంలో చంద్రశేఖర్ పాత్రపై స్మరణ**

రాయల చంద్రశేఖర్ జీవితాన్ని స్మరించుకుంటూ పలువురు వక్తలు ఆయన వివిధ ప్రాంతాల్లో పనిచేసిన విధానాన్ని, ఉద్యమానికి అంకితమైన జీవితాన్ని గుర్తుచేశారు. వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి ఉద్యమానికే ప్రాధాన్యతనిచ్చిన ఆయనలాంటి కార్యకర్తల జీవితాలను చరిత్రలో నమోదు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పుస్తకావిష్కరణ సభ కేవలం ఒక పుస్తకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంగా కాకుండా, రాయల చంద్రశేఖర్ జీవితం, ఆయన ఉద్యమ ప్రస్థానం, కుటుంబం ఎదుర్కొన్న పరిణామాలు, మృతి చుట్టూ నెలకొన్న అనుమానాలపై బహిరంగ చర్చకు వేదికగా మారింది.

**నిజాలు వెలుగులోకి రావాలన్న డిమాండ్**

చంద్రశేఖర్ మృతిపై ఎవరి ఆరోపణలు నిజమో, ఎవరి వాదనల్లో వాస్తవం ఉందో తేల్చాల్సింది సమగ్ర విచారణ ద్వారానేనని సభలో పలువురు అభిప్రాయపడ్డారు. రాజకీయ విభేదాలకు అతీతంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆయన కుటుంబానికి న్యాయం జరగాలని, విప్లవోద్యమంలోని సంస్థలు తమ వైఖరిని పునఃసమీక్షించుకోవాలని నాయకులు కోరారు. రాయల చంద్రశేఖర్ జీవితం, మృతి చుట్టూ కొనసాగుతున్న చర్చకు ఈ పుస్తకావిష్కరణ సభ మరోసారి తెరతీసింది. ఆయన మృతి వెనుక అసలు వాస్తవాలు ఏమిటన్నది సమగ్రంగా వెలుగులోకి రావాలంటే నిష్పాక్షిక విచారణే కీలకమనే అభిప్రాయం సభలో బలంగా వినిపించింది.

ఈ కార్యక్రమంలో ఎస్పాల్ సృజన అజయ్ మనోజ్ బృందం అనేక విప్లవ గేయాల ఆలపించారు.

ఈ కార్యక్రమంలో ఉపన్యాసించిన వారు సిపిఐ పార్టీకి చెందిన భాగం హేమంతరావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం కు చెందిన బొంతు రాంబాబు ఐఎఫ్టియు జాతి నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు మహిళా సంఘం నాయకురాలు పోటు కళావతి. పి ఓ డబ్ల్యు నాయకురాలు ఝాన్సీ. గౌరీ.పశ్య పద్మ, పీవీ శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్. కే వై రామచంద్రరావు, న్యూ డెమోక్రసీ నాయకులు గౌని ఐలయ్య, బండారు ఐలయ్య, ప్రముఖ కవి జీవన్ సార్, తదితరులు పాల్గొనగా ఈ కార్యక్రమానికి రాయల చంద్రశేఖర్ అభిమానులు భక్త రామదాసు కళాక్షేత్రం లో పెద్ద ఎత్తున చేరుకోగా ఆయనకు ఘనమైన నివాళులర్పించారు.

# ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమ్మె ఖమ్మం జిల్లా జేఏసీ పిలుపు




**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 16 (భద్రాద్రిన్యూస్ ):-** సిఐటియు ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ ఏఐఆర్ టి డబ్ల్యు ఎఫ్- సిఐటియు జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్ అధ్యక్షతన జరిగిన జేఏసీ సమావేశం. ఈ సమావేశంలో ఐ ఎన్ టి యు సి ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్ గౌడ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మవిష్ణు మాట్లాడుతూ

**సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి**

**కార్మికులకు అనువైన చోట అడ్డా లు ఏర్పాటు చేయాలి**

**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 రవాణా చట్టం రద్దు చేయాలి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని జీవనభృతి 12000 చెల్లించాలని , సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని , రవాణా రంగంలో ఆటో కార్మికులు ఎంతో కీలకపాత్ర వహిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు . ఆటో ఈఎంఐ కిస్తీలు ( ఫైనాన్స్ ) కట్టలేక ఆటోలను అమ్ముకొని రోడ్డున పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు . ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 12,000 జీవన భృతి వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఆటో కార్మికులు కిరాయిలు లేక అడ్డా ల మీద కూర్చుని ఏ కిరాయి దొరుకుతుందా ఎవరు వస్తారు అని ఎదురుచూస్తున్నారు .అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో కూడా రాపిడో లాంటి ప్రైవేట్ సంస్థలు వస్తున్న పరిస్థితి కనిపిస్తుంది . ఇప్పటికే కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్న ఆటో కార్మికులకు రాపిడో లాంటి సంస్థలు గుది బండగ మారాయి . రవాణా కార్మికులకు ఓలా ఉబర్ లాంటి ప్రైవేట్ యాప్ రద్దుచేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టి యు యాప్ ప్రవేశపెడతానని కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం 10 లక్షల రూపాయలు కల్పిస్తానని హామీ ఇచ్చినటువంటి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు రవాణా రంగ కార్మికుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రిగాని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కానీ స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటో కార్మికులకు జీవన భృతి చెల్లించినప్పుడు మరి తెలంగాణ రాష్ట్రంలో జీవన భృతి ఎందుకు చెల్లించరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు . ఆటో కార్మికుల ప్రయాణం మొత్తం రోడ్డుమీదనే ఉండటంవల్ల వారి యొక్క జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఒక సమగ్ర చట్టం చేయాలన్నారు . రవాణా రంగ కార్మికులకు గుది బండగ మారిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు . ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ జీవన భృతి 12000 వెంటనే చెల్లించాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మికులకు అనువైన చోట అడ్డా లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలోఏఐఆర్ టి డబ్ల్యు ఎఫ్- సీఐ టి యు జిల్లా అధ్యక్షులు వై విక్రమ్ , ఐఎన్టియుసి అధ్యక్షులు కొత్త సీతారాములు గారు, మోటార్ రంగం అధ్యక్షులు పాల్వంచ కృష్ణ , ఐ ఎన్ టి యు సి నగర అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు, ఏఐఆర్ టి డబ్ల్యు ఎఫ్ జిల్లా కోశాధికారి ధరావత్ రాందాస్ , ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు పేరబోయిన మోహన్రావు , కార్యదర్శి రావుల శ్రీనివాస్, బిఆర్టియు షేక్ సత్తార్ , జిల్లా శ్రీనివాస్ ,టియుసిఐ శ్రీను, మరియు నాతోనే నాయకులు రవీందర్ రెడ్డి తోట నాగరాజు , నాయకులు పాల్గొన్నారు పాల్గొన్నారు .

## వాసవి క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఘనంగా 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్):** వాసవి క్లబ్ ఖమ్మం , వాసవి క్లబ్ గాంధీ చౌక్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రజక వీధి నందు మాజీ గవర్నర్ కార్యాలయం ఎదురుగా 80వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవియన్ గోల్డెన్ స్టార్ కేసీ జిఎఫ్ ఫాస్ట్ గవర్నర్ మరియు ఇంటర్నేషనల్ డైరెక్టర్ శ్రీ కొత్తా వెంకటేశ్వరరావు , జోన్ చైర్మన్ పసుమర్తి రామ్మోహన్ రావు , ముఖ్యఅతిథులు పాల్గొన్నారు . 50మంది స్కూల్ పిల్లలకు బిస్కెట్లు నోటు పుస్తకాలు పెన్నులు మరియు మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వాసవియన్ పెద్దలు గుంటుపల్లి దివాకర్ గుప్తాగారు బచ్చు మురళి కృష్ణ కొంకిమళ్ళ విశ్వేశ్వరరావు, ధన్నరపు వాసవి వెచ్చా వీణ, గర్రెపల్లి ఉమారాణి గుప్తా శ్రీదేవి, కర్లపాటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ ఖమ్మం అధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చింతలపూడి శ్రీనివాసరావు ,ప్రధాన కార్యదర్శి వెచ్చా కృష్ణమోహన్ ,ట్రెజరర్ బూరుగుల యశ్వంత్ ,గాంధీ చౌక్ వాసవి క్లబ్ అధ్యక్షురాలు బోన గిరి సురేఖ ,సెక్రెటరీ వేముల లత ,ట్రెజరర్ దన్నారపు లక్ష్మీ భవాని తదితరులు పాల్గొన్నారు.

## డోర్నకల్ బిషప్ కు ఘన సన్మానం



**పాలేరు ఆగస్టు 16(భద్రాద్రి న్యూస్) :** నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డోర్నకల్ బిషప్ ది రైట్ రెవరెండ్ డాక్టర్ కె సైనం రాజ్ దంపతులను ఆదివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. బిషప్ పదవి చేపట్టి తొలిసారిగా తమ చర్చికి రావడంతో భక్తులోని ఎంతో సంతోషం నెలకొంది. తాను ఇదే చర్చిలో పాస్టర్ గా విధులు నిర్వహించి బిషప్ గా నియమితులు కావడంతో విశ్వాసుల్లోని మరింత విశ్వాసం కలిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధ్యక్ష మండల అభివృద్ధికి విద్య, వైద్యం, సామాజిక అంశాల పట్ల, సువార్త సేవల పట్ల అంకితభావంతో శక్తి వంచన లేకుండా అధ్యక్ష మండల కొరకు పాటుపడతానని బిషప్ రెవరెండ్ డాక్టర్ సే సేనం రాజ్ తెలిపారు. స్థానిక చర్చి పాస్టర్ ఆర్ ఇశ్రాయిల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టేట్ కమిటీ సభ్యులు, విశ్వాసులు, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు బస్సులు ఢీకొని ముగ్గురికి స్వల్పగాయాలు



**మునగాల , ఆగస్టు 16(భద్రాద్రి న్యూస్):** మునగాల మండలం ఆకుపాముల వద్ద జాతీయ రహదారి-65పై ఇవాళ(ఆదివారం) తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నర్సాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న శ్రీకృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఏలూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో మొత్తం 63 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆర్టీసీ బస్సు ముందు భాగంలో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో అతడిని బయటకు తీసేందుకు అగ్నిమాపక, పోలీసు, ఎన్‌హెచ్-65 సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. దాదాపు రెండు గంటలపాటు సహాయక చర్యలు చేపట్టి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసినట్లు సమాచారం. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## చెరసాల పరిచర్య కార్యక్రమంలో పాల్గొన్న మత గురువులు, విశ్వాసులు.

### - ఘనంగా మాక్స్ మిలియన్ కోల్బే పండుగ.




**పాలేరు , ఆగస్టు 16(భద్రాద్రి న్యూస్):** క్యాథలిక్ల చెరసాల పరిచర్య వ్యవస్థాపకులు మాక్స్ మిలియన్ కోల్బే పండుగను ఆదివారం స్థానిక కరుణగిరి పుణ్యక్షేత్రంలో ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లా ఆర్.సి.యం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ఆదేశాల ప్రకారం చెరసాల పరిచర్య విషయాల గురించి కరుణగిరి చర్చ్ డైరెక్టర్ ఫాదర్ జ్వనేష్ , చెరసాల పరిచర్య కోఆర్డినేటర్ డేవిడ్ లు విశ్వాసులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరసాలలో మగ్గుతున్న ఖైదీల కోసం సంస్థ తరపున అండగా నిలవాలని న్యాయ సలహాలను అందించి ఆ ఖైదీలు విడుదల కావడానికి తగిన న్యాయమార్గాల గురించి చర్చించారు. ఖైదీలకు సంబంధించిన బయట ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా అందించాలని వారి పిల్లల చదువులు నిరాటంకంగా కొనసాగేలా సహకరించడం గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మత గురువులు, సిస్టర్స్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు

## రిసెప్షన్ వేడుకకు హాజరైన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు...



ది.16.08.2026 మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన షేక్ అక్బర్ఆ అపీజా గార్ల దంపతుల కుమార్తె రిసెప్షన్ వేడుకకు ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు హాజరై నూతన వధూవరులను షేక్ సన -షేక్ ఇజాజ్ బాబా లను ఆశీర్వదించారు...

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 16 (భద్రాద్రిన్యూస్):** ఇల్లందు పట్టణంలోని మెయిన్ రోడ్‌లో గల కటకం సెలెక్షన్స్ నందు వాసవి క్లబ్ మరియు వనితా క్రౌన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని రాత్రి నుంచే రంగురంగుల జాతీయ జెండాలతో ప్రాంగణాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఇల్లందు లో జాతీయ జెండాను ఆవిష్కరించిన తొలి ఆర్యవైశ్య మహిళగా కటకం అలేఖ్య ఇల్లందు వాసవి క్లబ్ 34 ఏళ్ల చరిత్రలో అలాగే ఆర్యవైశ్య మహాసభలో ఇప్పటివరకు పలువురు అధ్యక్షులు, పట్టణ ప్రముఖులు జాతీయ జెండాను ఆవిష్కరించినప్పటికీ మహిళలకు ఈ అవకాశం దక్కలేదు.2026 వ సంవత్సరం లో ఇద్దరు అధ్యక్షులు ఉండగా జనవరి 26న జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వాసవి క్లబ్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించగా ఆగష్టు 15, 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వనితా క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య కి జాతీయ జెండాను ఆవిష్కరించే చారిత్రాత్మక గౌరవం దక్కింది. ఇల్లందు వాసవి క్లబ్ 34 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా ఒక ఆర్యవైశ్య మహిళ జాతీయ జెండాను ఆవిష్కరించడం విశేషంగా నిలిచింది. మహిళా నాయకత్వానికి, సమాన అవకాశాలకు ఇది ఒక గొప్ప గుర్తింపుగా నిలిచింది. ఈ అరుదైన గౌరవం తనకు దక్కడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని కటకం అలేఖ్య సంతోషం వ్యక్తం చేశారు. ఒక మహిళ చేతుల మీదుగా జాతీయ జెండా ఎగరడం మాత్రమే కాదు... మహిళా నాయకత్వానికి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన చారిత్రాత్మక ఘట్టంగా ఈ వేడుక నిలిచింది. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, కటకం అలేఖ్య , ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు , కోశాధికారిలు బోనగిరి రమేష్ , సముద్రాల ఉషా రాణి , ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వ్యామసాని జనార్దన్ రావు , జోన్ ఛైర్పర్సన్ బోనగిరి రవి కిరణ్ , డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ జొన్నల ఉపేందర్ నాద్ గుప్తా , ఆర్యవైశ్య మహసభ రాష్ట్ర నాయకులు తాటిపల్లి సుబ్బారావు , వాసవి క్లబ్ సభ్యులు మరియు ఇల్లందు ఆర్యవైశ్యులు కటకం పెద్ద సత్యనారాయణ , గౌరీశెట్టి కృష్ణ , వేముల భద్రయ్య , కటకం సుమన్ , కటకం చిన్న సత్యనారాయణ , మొదదుగు మహేష్ , ఓబిలిశెట్టి వెంకటేశ్వర్లు , కురవెల్లి రాజేశ్వరరావు , కటకం కృష్ణర్జునరావు , చంద్రుపట్ల సుధాకర్ , కటకం ప్రసాద్ , దొడ్డా రాజు , యెలుగురి సతీష్ , జంగాల హరీష్ , కటకం రేణుక దేవి, ఓబిలిశెట్టి కమల జ్యోతి , కటకం పుష్పలత , కటకం ఉమా దేవి , కటకం రమా దేవి , యెలుగురి అర్చన , ప్రొద్దుటూరి మణి , జంగాల రాజ్యలక్ష్మి , గౌరీశెట్టి లావణ్య , ప్రొద్దుటూరి సుమ శ్రీ , కటకం ప్రణవి బాలా , సముద్రాల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ భవన్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 16 (భద్రాద్రిన్యూస్):** ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, తెలంగాణ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రమతి తో కలిసి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భవిష్యత్ తరాలకు అందిస్తూ, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తెలంగాణ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఉద్యమాన్ని ముందుండి నడిపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితోనే తెలంగాణ హక్కుల కోసం జరిగిన ఉద్యమం కూడా సాగిందని పేర్కొన్నారు.

దేశం, తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా సుభిక్షంగా, శాంతియుతంగా, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పగడాల నరేందర్ చేత బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య



నేతలు బెల్లం వేణుగోపాల్, ఉప్పల వెంకటరమణ , వీరు నాయక్ , భాష బోయిన వీరన్న, మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్బూల్ , శీలంశెట్టి వీరభద్రం , నాయకులు మహమ్మద్ తాజుద్దీన్ , పగడాల నరేందర్ , భారతి , కొల్లు పద్మ , ముత్యాల వెంకట అప్పారావు ,బోజెడ్ల రాంమోహన్, సద్దాం , యలమద్ది రవి, లింగన్న బోయిన సతీష్ , బలుసు మురళీకృష్ణ , మహమ్మద్ రఫీ , ఆసిఫ్, బురహాన్, ఆరెంపుల వీరభద్రం , సింహాద్రి , చీకటి రాంబాబు , మాధవి , షకీనా , బొడ్డు గ్లోరి, కుమారి, వంశీ , ఫిరోజ్ , మునఫ్ ,షారుక్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం...

### - జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా పొన్నం ఉపేందర్ నాయుడు...

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 16( భద్రాద్రిన్యూస్ ):-** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖమ్మం పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్ లో గల భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఆఫీసు నందు ఓబీసీ మోర్చా ఖమ్మం జిల్లా నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించినారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ముందుగా ఖమ్మం జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు రేఖా సత్యనారాయణ యాదవ్ ని మరియు జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా పొన్నం ఉపేందర్ నాయుడు ని ప్రమాణ స్వీకారం చేయించినారు.ఈ సందర్భంగా అధ్యక్షులవారు మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీకి మోర్చాలే నిజమైన పునాదులని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలన్నీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు రేఖ సత్యనారాయణ మాట్లాడుతూ.. పోలింగ్ బూత్ స్థాయి నుండి ఓబిసి మోర్చా ను మరింత పటిష్టంగా అమలు చేయాలని నూతన కమిటీకి దిశానిర్దేశించినారు. జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పొన్నం ఉపేందర్ నాయుడు మాట్లాడుతూ... నాపై నమ్మకంతో ఈ ఉపాధ్యక్ష పదవి నియమించినందుకు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు రేఖా సత్యనారాయణ కి, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి



కోటేశ్వరరావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ... భారతీయ జనతా పార్టీ బలోపేతాన్ని కృషి చేస్తానని, అన్ని మోర్చాలతో అనుబంధంగా కలిసిమెలిసి ఉంటానని, మండల కమిటీ, నియోజకవర్గ కమిటీలతో అనుబంధంగా కలిసిమెలిసి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజు, పల్లపు వెంకన్న,ప్రధాన కార్యదర్శులు పిల్లలమర్రి వెంకట్, గంధసిరి వీరభద్రం గౌడ్, ఎల్ వెంకన్న, వేల్పుల సుధాకర్, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు దొంతు జ్వాలా నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల నాగేంద్ర, మందడపు సుబ్బారావు, పుల్లయ్య చౌదరి, రవి గౌడ్, మాధవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రత్తమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

- **స్వాతంత్ర్య దినోత్సవం నాడే మహిళ ఆత్మహత్యాయత్నం బాధాకరం**
- **ఆసుపత్రిలో బాధితురాలికి పరామర్శ**
- **మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**
- **కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ,ఆగస్టు 16(భద్రాద్రి న్యూస్):** కోదాడ ? మున్సిపాలిటీలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు పులి రత్తమ్మ, ఆమె కూతురు జ్యోతిల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మున్సిపల్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని రత్తమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమన్నారు. శనివారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రత్తమ్మను ఆయన పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి విధుల్లో ఉన్న కార్మికుల సర్వీస్ రికార్డులను పక్కనబెట్టి, జీతాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేయడం వల్లే ప్రాణాలకు తెగించే పరిస్థితి వచ్చిందన్నారు. 14 ఏళ్లుగా సేవలు అందిస్తున్న కూతురు జ్యోతికి కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న మున్సిపల్ యంత్రంగం, నిరుపేద కార్మికుల పొట్టకొట్టడం తగదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని, రత్తమ్మ కుటుంబానికి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం



చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు షేక్ నయీమ్, కౌన్సిలర్ చీమ నరేష్ బాబు, గట్ల కోటేశ్వరరావు,సంపేట ఉపేందర్, బత్తుల ఉపేందర్, సోమపొంగు రాజు, మాదాల ఉపేందర్,చీమ శ్రీను, చలిగంటి లక్ష్మణ్, నేలవెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పరామర్శ

### - ఫారెస్ట్ బీట్ అధికారి నవీన్ కుటుంబానికి ఓదార్పు.. అంజి చిత్రపటానికి నివాళి

**కారేపల్లి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండలంలో మాజీ వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఆదివారం పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన ఫారెస్ట్ బీట్ అధికారి బానోత్ నవీన్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ముందుగా వెంకటీయా తండాకు చేరుకున్న రాములు నాయక్.. నవీన్ తండ్రి, మాజీ ఎంపీపీ బానోత్ దేవుల నాయక్‌ను పరామర్శించారు. అనంతరం నవీన్ సతీమణి, పిల్లలతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం చిన్నకట్టుగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన లకావత్ అంజి దశదిన కార్యక్రమానికి రాములు నాయక్ హాజరయ్యారు. అంజి



చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సర్పంచ్ ధారావత్ మంగీలాల్, ఆడప పుల్లారావు, మాజీ సర్పంచ్ బానోత్ శంకర్, భగవాన్ దాస్, వాంకుడోత్ కృష్ణ, నాయకులు అజ్మీర వీరన్న, డాక్టర్ బాబులాల్, గోపాల్, గుగులోత్ నవీన్, యుగంధర్, రవి, బానోత్




చక్రం, మాజీ ఎంపీటీసీ లాలు, బుచ్చిరాం, గ్రామ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలేవి?

**- 90 రోజులుగా జీతాలు అందక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అవస్థలు**
**- పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి: భూక్య శివ నాయక్**
**- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం**

**కారేపల్లి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేస్తూ నిరంతరం పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందకపోవడం దారుణమని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కారేపల్లి--కామేపల్లి సబ్‌డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన కారేపల్లి--కామేపల్లి సబ్‌డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఖాతాల నిర్వాహకులు, అటెండర్లు, ఏపీవోలు, ఈసీలు, డ్రైవర్లు తదితర సిబ్బందికి గత రెండు, మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొందని భూక్య శివ నాయక్ విమర్శించారు. నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది సిబ్బందికి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న ఇతర అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సైతం సుమారు 90 రోజులుగా వేతనాలు అందడం లేదన్నారు. వేతనాల చెల్లింపులో సాంకేతిక కారణాలను అధికారులు చూపుతున్నారని, అలాంటి కారణాలతో ఉద్యోగులు, వారి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను



వెంటనే ఒకేసారి విడుదల చేయాలని భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సిబ్బందికి ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. వేతనాలు తక్షణమే విడుదల చేయకపోతే సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో జిల్లా, మండల, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు భాగ్య, అరుణోదయ కళాకారులు దంతాల నారాయణ, పార్టీ జిల్లా నాయకులు కోటక్క, ఈసం శ్రీను, రాధక్క, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడిగా లావుడ్యా విగ్నేష్ చౌహాన్ నాయక్

**- విద్యార్థులు, యువత సమస్యలపై నిరంతరం పోరాడుతా: విగ్నేష్ చౌహాన్ నాయక్**

**కారేపల్లి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** గిరిజన విద్యార్థి సంఘం సింగరేణి (కారేపల్లి) మండల అధ్యక్షుడిగా లావుడ్యా విగ్నేష్ చౌహాన్ నాయక్ నియమితులయ్యారు. రాష్ట్ర నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. సింగరేణి (కారేపల్లి) మండల అధ్యక్షుడు ఆంగోత్ రవి (ఠాగూర్) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అలియా తండా, ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన లావుడ్యా విగ్నేష్ చౌహాన్ నాయక్‌ను గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం నియామక ఉత్తర్వులను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అజ్మీర సుశీల భాయ్ అందజేశారు. నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్, జాతీయ అధ్యక్షుడు మూడావత్ శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ఫుల్‌సింగ్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా నాయక్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు లావుడ్యా విగ్నేష్ చౌహాన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తరతరాలుగా వెనుకబడిన గిరిజన సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు విద్యార్థులు, యువత సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అజ్మీర సుశీల భాయ్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తేజ రాందాస్ నాయక్, సింగరేణి (కారేపల్లి) మండల అధ్యక్షుడు ఆంగోత్ రవి



(ఠాగూర్), ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షురాలు స్వాతి భాయ్, ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు ధరావత్ జ్యోతిబాయ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ కిషన్ నాయక్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులంలో విద్యార్థులపై దాడి.. చర్యలకు డిమాండ్

**- సుమారు 15 మంది విద్యార్థులపై సీనియర్ల దాడి ఆరోపణలు.. గురుకులం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా**

**సింగరేణి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 15 మంది విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు దాడికి పాల్పడిన ఘటనపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, జీవీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జి. మస్తాన్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్, జీవీఎస్ నాయకుడు బాలాజీ నాయక్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థుల వేధింపులు, దాడులతో భయాందోళనకు గురైన పదో తరగతి విద్యార్థులు రాత్రివేళ సమీపంలోని అటవీ ప్రాంతంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విద్యార్థుల భద్రతపై గురుకుల యాజమాన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులపై దాడి జరిగిన సమయంలో పాఠశాల వార్డెన్, ప్రిన్సిపాల్ పర్యవేక్షణపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనను నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, జీవీఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.

**విద్యార్థి సంఘాల ప్రధాన డిమాండ్లు**

- విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డెన్, ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.
- గురుకులంలోని విద్యార్థులందరికీ పూర్తిస్థాయి భద్రత కల్పించాలి.



- భయాందోళనకు గురైన పదో తరగతి విద్యార్థులకు అవసరమైన వైద్యం, మానసిక పరామర్శ అందించాలి.
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

విద్యార్థుల భద్రతపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

# తీజ్ పండుగకు ఘనంగా ఏర్పాట్లు..

**- సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో బంజారా సంప్రదాయ వేడుకలు**
**- గాదెపాడులో భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ.. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు**

**సింగరేణి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం గాదెపాడు గ్రామంలో బంజారా సోదరుల ముఖ్య పండుగైన తీజ్ పండుగను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బంజారా సంప్రదాయాలు, ఆచారాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బంజారా సోదరులు దండియాడి, సేవాబాయి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, పశుపక్షాదులు అభివృద్ధి చెందాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని దేవతలను ప్రార్థించారు. తీజ్ పండుగలో భాగంగా గోధుమలతో పెంచిన మొలకల బుట్టలను ప్రత్యేకంగా పూజించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో వాటిని గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా వేడుకలను



నిర్వహించారు. సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండడంతో పాటు గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని దేవతలను వేడుకున్నట్లు తెలిపారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# చిన్నపాటి వర్షానికే తాడ్వాయి వీధులు జలమయం

**- గ్రామాలపై కన్నెత్తి చూడని అధికారులు.. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన అధికార యంత్రాంగం**
**- ఇప్పటికైనా స్పందించకుంటే కలెక్టరేట్ ముట్టడి తప్పదని తాడ్వాయి ప్రజల తీవ్ర హెచ్చరిక**

**కోదాడ, ఆగస్టు 16(భద్రాద్రి న్యూస్):** కోదాడ నియోజకవర్గం మునగాల మండలము తాడ్వాయి గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల సమస్యపై స్థానిక అధికారుల మొండి వైఖరి, తీవ్ర నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. గ్రామంలో సరైన డ్రైనేజీ వసతి లేకపోవడంతో, కురిసిన చిన్నపాటి వర్షానికే ఇండ్ల ముందు ఉన్న రోడ్లన్నీ పూర్తిగా జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీరంతా ఇండ్ల ముందుకు చేరి నిలిచిపోతుండటంతో స్థానిక నివాసితులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజలు ఇంతలా అల్లాడిపోతున్నా మునగాల మండల అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేయడంపై గ్రామ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**రాజకీయ దురుద్దేశంతోనే ఈ బజారును వదిలేశారు - చూసి చూడనట్లుగా అధికారులు**

తాడ్వాయి గ్రామంలోని మిగతా అన్ని రోడ్లపై అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ, ఈ పాత బజారును మాత్రం పూర్తిగా వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం రాజకీయ దురుద్దేశం తోటే ఈ ప్రాంత సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఇక్కడ వీధులన్నీ బురదమయంగా మారి ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొన్నా, దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నా.. కన్నెత్తి చూడని అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ నిర్లక్ష్యంగా కాలం గడుపుతున్నారు. అధికారుల ఈ వివక్ష వల్లే నేడు రోడ్లపై మోకాళ్ల లోతు మురుగునీరు నిలిచిపోయి, గ్రామస్థులు, యువకులే స్వచ్ఛందంగా పారలు పట్టి నీటిని పక్కకు మళ్లించాల్సి వస్తోందని, అసలు అధికారులు ఎందుకు ఉన్నారని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

మండల అభివృద్ధి అధికారి స్పందించాలి - వార్డు ప్రజల వేడుకోలు

ఇప్పటికైనా మునగాల మండల అభివృద్ధి అధికారి ప్రత్యేకంగా స్పందించి, రాజకీయ వివక్షను పక్కనబెట్టి, చూసి చూడనట్లుగా





వ్యవహరించే పద్ధతి వీడాలన్నారు. ఈ బజారును పూర్తిగా గాలికి వదిలేయకుండా తక్షణమే రోడ్డు మరమ్మతులు మరియు శాశ్వత మురుగునీటి కాలువలు నిర్మించాలని ఆ వార్డు ప్రజలు వేడుకుంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మారకుంటే, రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలంతా ఏకమై నేరుగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆందోళనలను ఉధృతం చేస్తామని తాడ్వాయి ప్రజలు తీవ్రస్థాయిలో హెచ్చరిస్తున్నారు.

# పేరుపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**- రూ.4.50 లక్షల ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణం ప్రారంభం**



**సింగరేణి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం పేరుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రాంసహాయం రఘురామ్ రెడ్డి ఎంపీ నిధుల నుంచి రూ.4.50 లక్షల వ్యయంతో ఈ సీసీ రోడ్డు మంజూరైంది. గ్రామంలోని తెల్లగొర్ల పిచ్చయ్య ఇంటి నుంచి చింతిరాల సుశీలమ్మ ఇంటి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ బాణోత్ పద్మావతి--వీరభద్రు భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో రహదారి సమస్యను పరిష్కరించేలా సీసీ రోడ్డు మంజూరు చేసిన ఎంపీ రాంసహాయం రఘురామ్ రెడ్డికి, చొరవ చూపిన కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వర్‌రావుకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ మధ్యానపు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు బాణోత్ వీరభద్రు, పులకాని సత్తిరెడ్డి, మేడ వెంకన్న, మాజీ గుడి చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు, బుడిగ సత్యనారాయణ, తెల్లగొర్ల పిచ్చయ్య, బండారు రామకోటి, బండారు శ్రీనివాసరావు, కాలపాక వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బండారు మురళి, తెల్లగొర్ల భద్రి, మీడియా ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉసిరికాయలపల్లిలో వైభవంగా బోనాల పండుగ

**- యాదవ సోదరుల భక్తి వైభవం.. అమ్మవారికి ఘనంగా బోనాల సమర్పణ**



**కారేపల్లి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండుగను యాదవ సోదరులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. పల్లె పల్లెనా ప్రగతి దీపాలు వెలగాలని, గ్రామ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని భక్తులు వేడుకున్నారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా నెత్తిన బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామదేవతకు నైవేద్యాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. యాదవ సోదరులు ఏకమై ఎంతో నిష్టతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాన్ని సుఖశాంతులతో చల్లగా చూడాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల ఉత్సవాల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గద్దం వెంకటేశ్వర్లు, రాచబండి నాగేశ్వరరావు, మండల వెంకటేశ్వర్లు, రెడ్డబోయిన గోపి యాదవ్, పచ్చిపాల తిరుపయ్య, రెడ్డబోయిన వెంకటేశ్వర్లు, రెడ్డబోయిన రవి, రెడ్డబోయిన సైదులు, పచ్చిపాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన పాత్రికేయుడు రాంబాబుకు డాక్టర్ బదావత్ రవి పరామర్శ

**- ఆపదలో ఉన్నవారికి అండగా మిషన్ వాక్ ఫౌండేషన్..**
**- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



**సింగరేణి, ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం బొక్కలుతండాకు చెందిన పాత్రికేయుడు రాంబాబును మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బదావత్ రవి ఆదివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో రాంబాబు చేతికి గాయం కాగా, చికిత్స పొందుతున్నారు. రోజువారీ వ్యవసాయ పనుల్లో భాగంగా పొలానికి వెళ్లిన రాంబాబు.. పొలం గట్లపై నుంచి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయారు. ఈ ఘటనలో ఆయన చేతికి ఫ్యాక్చర్ కావడంతో వైద్యం పొందుతున్నారు. విషయం తెలుసుకున్న డాక్టర్ బదావత్ రవి రాంబాబు వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స వివరాలను తెలుసుకుని, రాంబాబుకు ధైర్యం చెప్పారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఓ ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్పందించి ఆప్యాయంగా పరామర్శించి ధైర్యం చెప్పిన డాక్టర్ బదావత్ రవికి రాంబాబు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బదావత్ రవి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం మిషన్ వాక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగమని తెలిపారు. రాంబాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఆదర్శంగా నిలుస్తున్న జడ్పీహెచ్ఎస్ మునుగోడు 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

**- పదో తరగతి ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత**





**మునుగోడు, ఆగస్టు 16 : ( భద్రాద్రి న్యూస్ )** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పాఠశాల 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగదు ప్రోత్సాహక బహుమతులను అంద జేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.మొదటి స్థానంలో నిలిచిన యంపల్ల దీక్ష 10 వే రూలు,ద్వితీయ స్థానంలో నిలిచిన బీమనపల్లి ఐష్ కు 5 వేల రూ మరియు దోటి గీత 5 వేల రూలు,తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణవేణి కి 3 వేల రూలు ,ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, పాఠశాల సీనియర్ పూర్వ ఉపాధ్యాయులు నల్లి నిరంజన్ హాజరై, పూర్వ విద్యార్థుల చేతుల మీదుగా విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించారు.సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ మాట్లాడుతూ..చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకుని, ప్రస్తుత విద్యార్థులను ప్రోత్సహించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.సీనియర్ పూర్వ ఉపాధ్యాయులు నల్లి నిరంజన్ తెలిపారు.విద్యార్థులు ఈ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రధానోపాధ్యాయులు బాలప్రసాద్,పాఠశాల చైర్మెన్ ఎల్లమ్మ 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,కూరెళ్ళ జ్ఞానేశ్వర్,ముచ్చపోతుల రవి,బొల్లు సైదులు,జీడిమెట్ల రవీందర్,నారగోని శ్రీశైలం,ముచ్చపోతుల శ్రవణ్,చేనేత సంఘం డైరెక్టర్ బొల్ల చంద్రకళ,వార్డు సభ్యులు బీమనపల్లి ప్రవళిక,నారగోని అనూష,ఉపాధ్యాయులు కునూరెడ్డి సత్తిరెడ్డి, రత్నయ్య,బాబురావు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు..

6
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
www.bhadradrinews.com
Follow :
@bhadradrinews
సోమవారం
17 ।ఆగస్టు। 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

# ఖమ్మం జిల్లా సెపక్ తక్రా ( లెగ్ వాలీబాల్ ) అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా డాక్టర్ కాపా మురళీకృష్ణ







**వైరా, ఆగస్టు 16, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీలో ఖమ్మం జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 2026 – 2030 సంవత్సరాలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ ఎన్నిక వైరా మున్సిపల్ కమిటీ హాల్లో ఆదివారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి తెలంగాణ స్టేట్ సెపక్ తక్రా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆర్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వై.బుచ్చి రామారావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు అధ్యక్షులు డాక్టర్ కాపామురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా వుంద్రు శ్యాంబాబు, శీలం శ్రీవిద్య, పి. రమణ, తోటకూర శ్రీకాంత్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ నేహాల్, అరుణ పల్లి అనిల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పులి మధు, కోశాధికారి పి. సతీష్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ జంగాల కోటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ పి. రఘువరన్, పేరుపల్లి శ్రీను, కే శివకృష్ణ, రోజా అడ్వైజర్లగా పువ్వాళ్ళ రాము, బిక్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్. అనూష, బి. ఆమని, వి. త్రినాథ్, బి. పవన్, జై. గోపాలకృష్ణ, కొల్లూరు, సి. సురేంద్ర రాహుల్, 2026– 2030 నూతన కార్యవర్గ ఎన్నికల కార్యక్రమం తెలంగాణ స్టేట్ అడ్వైజర్ గా కె భాస్కర్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అడ్వైజర్ గా క్రిస్టోఫర్ బాబు, ఖమ్మం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పర్యవేక్షణ నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సెపక్ తక్రా క్రీడాకారులు, తేడా అభిమానులు, నిర్వాహకులు, ఖమ్మం జిల్లా ప్రజలు అభినందన తెలియజేశారు. నూతన కార్యవర్గ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో సెపక్ తక్రా క్రీడాభివృద్ధికి, మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు

## సీతారామ కాలువలో పడి వ్యక్తి గల్లంతు



**చంద్రుగొండ భద్రాద్రి న్యూస్ ప్రతినిధి:** మండలంలోని మద్దుకూరు గ్రామ శివారు లోనీ సీతారామ కాలువ లో ఆదివారం వ్యక్తి పడి గల్లంతు అయ్యాడు.. ప్రత్యక్ష సాక్షులు.. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మద్దుకూరు గ్రామానికి చెందిన కుర్సం కృష్ణ(45) కూలి పనులకు వెళ్ళాడు.. సాయంత్రం సీతారామ కాలువలో కాళ్ళు కడుగుకుంటుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. అక్కడే ఉన్న పలువురు అరుస్తుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు.. కృష్ణకు భార్య నీల.. ముగ్గురు కుమారులున్నారు. సమాచారం తెల్సిన పోలీస్ లు.. గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు.

## నేడు మండలంలో ఎంపీ ఎమ్మెల్యే పర్యటన



**చంద్రుగొండ భద్రాద్రి న్యూస్ ప్రతినిధి:** నేడు చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాలలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి , అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించనున్నారు ఉదయం 9.30 గం : కరిసెలబోడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను సందర్శిస్తారు, 10గంటలకి వంకనంబరు గ్రామంలో సిసి రోడ్లు శంకుస్థాపన చేస్తారు,10.30 గంటలకు బాల్యతండ లోని స్కూల్ ప్రహరీ గోడ ప్రారంభిస్తారు,11 గంటలకి రావికంపాడు గ్రామంలో జజ రోడ్లు ప్రారంభిస్తారు అనంతరశీ తిప్పనపల్లిలో జజ రోడ్లు ప్రారంభిస్తారు అనంతరం మహ్మద్ నగర్ లో అంగన్వాడీ భవనం, ప్రహరీ గోడ ప్రారంభిస్తారు, సీతయగూడెం గ్రామంలో దీ రోడ్డు శంకుస్థాపన చేయనున్నారు ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.....

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పిఆర్సిడిఎ బిల్లులు పరిష్కారానికై ఈ నెల 17న ఖమ్మంలో భారీ ధర్నా : పీఆర్టీయూ పిలుపు



**కామేపల్లి ఆగస్టు 16 (భద్రాద్రి న్యూస్):** కొత్త పీఆర్సీ సాధన, పెండింగ్ డీఏ ల విడుదల,సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న సోమవారం నాడు ఖమ్మం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ కామేపల్లి మండల శాఖ పిలుపునిచ్చింది.
?కామేపల్లి మండల శాఖ అధ్యక్షులు పి. రాములు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లవుతున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఉపాధ్యాయ సమస్యల హామీలను నెరవేర్చకపోవడం శోచనీయమని అన్నారు. ఎమ్ఎల్సీ శ్రీపాల్ రెడ్డి,రాష్ట్ర నాయకులు పులగం దామోదర్ రెడ్డి, సుంకర బిక్షం గౌడ్ల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా అనిచి వేత ధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు.
?సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి టి. వెంకన్న,రాష్ట్ర బాధ్యులు, నాయకులు గుడిపూడి శ్రీనివాసరావు,పి. రాములు తదితరులు పాల్గొన్నారు

# పామ్ ఆయిల్ సాగుపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి

- తన వ్యవసాయ పొలంలో సాగు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**వనపర్తి , ఆగస్టు 16: :** ఒకవైపు సమర్థవంతమైన ప్రజా పాలన కొనసాగిస్తూనే, మరోవైపు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన వ్యవసాయ పొలాన్ని కుమారుడు నవనీత్ రెడ్డితో కలిసి సందర్శించిన ఆయన, పామ్ ఆయిల్ తోట ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. పామ్ ఆయిల్ సాగుకు అనుకూలమైన పరిస్థితులు, తోట ఏర్పాటుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందితో ఎమ్మెల్యే చర్చించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ రైతులకు ఆదాయం పెంచే పామ్ ఆయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మామిడి తోటను పరిశీలించిన ఎమ్మెల్యే చెట్ల ఎదుగుదల, తోట ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెట్లకు అవసరమైన ఎరువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మామిడి దిగుబడి ఆశించిన స్థాయిలో రావాలంటే సరైన సమయంలో అవసరమైన పోషకాలను అందించడంతో పాటు, తెగుళ్లు, పురుగుల నివారణకు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. తోటను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చెట్ల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని సూచించారు. అనంతరం తనకు ఎంతో ఇష్టమైన ఆవుల బాగోగులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వాటి ఆరోగ్యం, సంరక్షణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని, స్వయంగా ఆవులకు అరటి పండ్లు తినిపించారు. ఆవులను జాగ్రత్తగా సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.

### నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి పట్టణంలోని కళ్యాణ సాయి గార్డెన్స్‌లో నిర్వహించిన వివాహ వేడుకకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశి రమేష్ యాదవ్, దేశి జయమ్మ దంపతుల కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పరస్పర అనురాగంతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమా, కల్యాణలక్ష్మి పథకాలపై ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ నిరసన

- బెజ్జంకి మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**బెజ్జంకి, ఆగస్టు 16 :** మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ కూడలి వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు బీమా,కల్యాణ లక్ష్మి పథకాలపై ప్రభుత్వం వైఖరిని పై నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీఆర్ఎస్ మండల నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతు బీమా ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.రైతుల సంక్షేమాన్ని విస్మరించకుండా వెంటనే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే పేద కుటుంబాలకు అండగా నిలిచే కల్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని కోరారు.రైతులు,పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదూ అనీ అన్నారు.వెంటనే స్పందించి రైతు బీమా,కల్యాణ లక్ష్మి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న,నాయకులు లింగాల లక్ష్మణ్,కనగండ్ల తిరుపతి,కచ్చు రాజయ్య,ముక్కిస తిరుపతి రెడ్డి,ఉప సర్పంచ్ దుమాల మహేష్,ఎల శేఖర్ బాబు, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల నర్స,ఎలుక దేవయ్య,వంగల నరేష్ పటేల్,అయిలేని నరసింహారెడ్డి,బండి రమేష్,పరశు రాములు,శివ,మహేష్వెంకటేష్,బాబుమియా,శంకర్,మాషం బాబు,రామ్ రెడ్డి,లింగాల బాబు,గణపురం మల్లయ్య,బొమ్మిడి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి

- ఎస్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు పులిపాటి లక్ష్మణ్



**మల్దకల్, ఆగస్టు 16 :** జిల్లా కేంద్రంలో ఎస్ టియుటిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారంజిల్లా అధ్యక్షులు పులిపాటి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ డీఏలు విడుదల చేస్తామని, పి ఆర్ సిని అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయకపోవడం చాలా బాధాకరమని,ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఆరు డీఏలు విడుదల చేయాలని,పిఆర్ సిని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి ఈ హెచ్ ఎస్ కు 1.5% జీతం కట్ అయిన ఇంతవరకు హెల్త్ కార్డ్స్ ఇవ్వకపోవడం, పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం చాలా దారుణమైన విషయమని అన్నారు.ఎస్ టి యు టి ఎస్ సంఘ తరపున త్వరలో పోరాటం చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని, అలాగే ఏర్పడిన ఖాళీలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధించాలన్నారు. డీఎస్సీ– 2008 ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులరైజేషన్ చేసి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సంఘ సభ్యత్వంను చురుకుగా చేయించాలని, సంఘ 80వ వసంతోత్సవాలను ఘనంగానిర్వహించుటకు సంఘ సభ్యులు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి.యూనుస్ పాష,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ నాయక్,జిల్లా ఆర్థిక కార్యదర్శి విజయభాస్కర్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేష్,భీమన్న, సురేంద్రరావు, మండలాల అధ్యక్ష కార్యదర్శులు,ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే



**మల్దకల్, ఆగస్టు 16 :** మండలం పరిధిలో మేకలసోంపల్లి, కుర్తిరావులచెరువు గ్రామాలలో ఆదివారం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరు కాగామేకల సోంపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరికుఇల్లు,కుర్తిరావులచెరువు గ్రామానికి చెందిన సువార్తమ్మనిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగిందని దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్నత్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డికి,గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిసారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో మంత్రికి, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,సర్పంచ్ రాముడు, నాయకులు రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్,వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,శివ, అహ్మద్,భాస్కర్ గౌడు, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- త్రిబుల్ ఐటీ విద్యార్థులకు ద్యాప నిఖిల్ రెడ్డి ఆర్థిక చేయూత




**ఉర్కొండ, ఆగస్టు 16 :** మండలంలోనీ గ్రామాలలో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయము అందిస్తున్న మాదారం మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ద్యాప నిఖిల్ రెడ్డి మరోసారి తమ సేవ గుణాన్ని చాటుకున్నారు.చదువులో ప్రతిభ కనబరచిన పేద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ద్యాప నిఖిల్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. ఉర్కొండ మండలంలోని ఉర్కొండ పేట జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన నౌషిన్ బేగం, సిరిగిరి ఇందులు త్రిబుల్ ఐటీ బాసరలో సీట్లు సంపాదించారు. వారి ఉన్నత విద్యకు అండగా నిలిచేందుకు నిఖిల్ రెడ్డి ఒక్కొక్కరికి 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం, స్థానిక సర్పంచ్ రషీద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్, వార్డుసభ్యులు, గ్రామస్తులు వహిదొద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేధించాలని, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం చేస్తున్నట్లు తెలిపారు. త్రిబుల్ ఐటీలో సీటు రావడం గ్రామానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు నిఖిల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# వాజ్‌పేయ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం

- జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 16 :** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ 8వ వర్ధంతి సందర్భంగా బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్. లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పాయ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రధానమంత్రిగా ఆయన గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ కోసం స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టు, టెలిఫోన్ కనెక్టివిటీ, గ్యాస్ కనెక్షన్ల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సుదీర్ఘకాలం ప్రతిపక్ష నేతగా కొనసాగిన వాజ్‌పాయ్ 1996లో తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 13 రోజుల పాటు, 1998లో రెండోసారి ప్రధానమంత్రిగా 13 నెలల పాటు కొనసాగారని గుర్తుచేశారు. అనంతరం కేవలం ఒక్క ఎంపీ ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఏర్పడినప్పటికీ, రాజకీయ బేరసారాలకు పాల్పడకుండా రాజీనామా చేసి హుందాగా ఎన్నికలకు వెళ్లిన మహానేతగా వాజ్‌పాయ్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. సుమారు ఐదు దశాబ్దాల పాటు పార్లమెంటరీ రాజకీయాల్లో కొనసాగి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో శాంతి కోసం వాజ్‌పాయ్ చేపట్టిన బస్సు యాత్రను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అయితే అనంతరం పాకిస్థాన్ కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడగా, భారత సైన్యం ధైర్యసాహసాలతో ఎదుర్కొని విజయం సాధించిందన్నారు. అంతర్జాతీయ ఒత్తిళ్లను లెక్కచేయకుండా పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిన దూరదృష్టి కలిగిన పరిపాలనాదక్షుడని కొనియాడారు. వాజ్‌పాయ్ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించిందని తెలిపారు. అనారోగ్య కారణాలతో అవార్డును స్వీకరించేందుకు ఆయన వెళ్లలేని పరిస్థితిలో అప్పటి రాష్ట్రపతి స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి భారతరత్నను అందజేశారని గుర్తుచేశారు. అనంతరం అనారోగ్య సమస్యలతో 2018 ఆగస్టు 16న ఢిల్లీలో వాజ్‌పాయ్ తుదిశ్వాస విడిచారని అన్నారు. వాజ్‌పాయ్ ఆశయాలు, దేశసేవా స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలని ఆర్. లోకనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. అనుజ్ఞా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బాసెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కటమోని కృష్ణ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, పట్టణ కార్యదర్శి చినరాయుడు, కంటెస్టెడ్ కౌన్సిలర్ గంధం బాలపీరు తదితరులు పాల్గొన్నారు.